క్లుప్తంగా

అల్లాడుపల్లెలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

చాపాడు : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్ర మైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అన్న సత్రంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా వీరభద్రస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అలానే ఆలయంలో కొలువైన కేదారీశ్వర స్వామిపై ఉదయం సూర్యకిరణాలు పడటంతో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు నారాయణ యాదవ్, గోసుల వీరారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, వీరారెడ్డి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మైదుకూరు : నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను సోమవారం ఆ పార్టీ నాయకులు మైదుకూరులో ఆవిష్కరించారు. స్థానిక సుందరయ్య కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో 27న పార్టీ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని తెలిపారు. 3వ తేదీ మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గురయ్య, హుస్సేన్, రవి హరి, దేవదాసు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



పరిమళాజ్యోతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న పరిమళజ్యోతికి బ్రాంజ్ మెడల్ లభించింది. కడపలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో 200 మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొనగా 'మనబడి'పై కవిత రాసినందుకు పరిమళజ్యోతికి బ్రాంజ్ మెడల్ లభించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం పరిమళజ్యోతిని పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, సురేష్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతిని సోమవారం సాయంత్రం శ్రీ రాయలసేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల చెరువు కట్టపై శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. రచయిత బొల్లు రామ్మోహన్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు తెలుగు జాతికి స్ఫూర్తి నిలచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసేవా సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, నాయకులు నరేష్, బాలచంద్ర, సుబ్బరాయుడు, జనసేన నాయకులు లక్షుమయ్య, రమణయ్య పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన




ప్రదర్శనలో పాల్గొన్న పశు వైద్యాధికారులు

ఖాజీపేట : రైతులు వ్యవసాయంతోపాటు పాల దిగుబడిపై దృష్టి సారించాలని దీని వల్ల రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ రైతులకు సూచించారు. ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయతీలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలలో 55 లేత దూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల దిగుబడి పై రైతులు దృష్టి సారించాలన్నారు. అందుకు కావాల్సిన చేయూత ప్రభుత్వం నుంచి వస్తుందన్నారు. శిబిరంలో 450 గొర్రెలకు నట్టల నివారణ, 52 పశువులకు గర్భకోశ పరీక్షలు, 55 దూడలకు డి వార్మింగ్ చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయ్యేనా - రైతుల బెంగ తీరేనా?

- ఎడారిని తలపిస్తున్న సాగునీటి చెరువులు
- అడుగంటిపోయిన భూగర్భజలాలు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం పనులు
- ఆందోళన చెందుతున్న రైతులు



నీరు లేక ఎడారిని తలపిస్తున్న వరికుంట్ల చెరువు



తెలుగుగంగ ఎడమకాలువలో పారుతున్న నీరు

కాశినాయన : ఆరుగాలం కష్టపడుతున్న రైతన్నకు అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతున్నాయి. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వారి పరిస్థితి. ఆయకట్టు చెరువులకు సాగునీరు అందించేందుకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినా సగం పనులు పూర్తి చేసినా ఇప్పటికి చుక్కనీరు అందని పరిస్థితి.

ఒక పక్క అతివృష్టి మరో పక్క అనావృష్టి, చీడ పీడలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు రైతులను నట్టేట ముంచుతున్నాయి. దీనికి తోడు వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో బోరుబావుల్లో నీటి మట్టం తగ్గడంతో అరకొరగా సాగుచేసిన పంటలు చేతికొస్తాయా రావా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అధికారంలోకి ఉన్న టీడీపీ నాయకులు మేము అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీటిని నింపుతామని ఎన్నికల్లో వాగ్దానం ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వాగ్దానం నెరవేర్చలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

రూ.45 కోట్లతో పనులు

మండలంలోని వరికుంట్ల, గంగనపల్లె, కొండ్రాజుపల్లె, సావిశెట్టిపల్లె, ఇటుగుల్లపాడు, గొంటువారి పల్లె, బాలాయపల్లె చెరువుల కింద 6 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాభావంతో పొలాలు బీడుగా మారడంతో 2023లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పొలాలను సాగులోకి తెచ్చేందుకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి నీరు అందించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా రూ.45 కోట్లు నిధులు మంజూరు చేసింది. తెలుగుగంగ ఎడమ కాలువ ద్వారా మొదటగా వరికుంట్ల, గొంటువారిపల్లె, బాలాయపల్లె, గంగనపల్లె చెరువులకు నీరు అందించేందుకు పైపులైను పనులు పూర్తయ్యాయి. ఆ తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం పనులను చేపట్టలేదు. అప్పట్లో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు రూ.7 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. ఈ నిధులు మంజూరైతే పని పూర్తి చేస్తానని ఆయన చెబుతున్నారు. ఎటుతిరిగి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పక్కనే నీరు ఉన్నా అందని వైనం

బ్రహ్మంసాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. పక్కనే ఆ నీరు పల్లెల మీదుగా పోతున్నా ఉపయోగించుకోలేని దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయి బోరుబావుల్లో నీరు రాకపోవడంతో కొంత మంది రైతులు వ్యవసాయం వదలి బెంగుళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు వలస వెళ్ళారు. మరి కొంత మంది వర్షాధారంగా అరకొర పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి చెరువులకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్ట్ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి



లిఫ్ట్ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేసి చెరువులకు నీరు అందించాలి. చెరువులకు నీటిని నింపితే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. దీంతో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు లిఫ్ట్ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- జి.సిద్దారెడ్డి, రైతు, గంగనపల్లె, కాశినాయన మండలం

బోర్లు ఎండిపోయాయి



బోరుబావుల కింద పంటలు సాగు చేద్దామనుకుంటే బోరుబావుల్లో నీరు ఇంకిపోయాయి. లిఫ్ట్ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు అందిస్తే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని చెరువులకు నీరు అందించాలి.

- కె.రవీంద్రారెడ్డి, రైతు, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

నేడు, రేపు దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు

చాపాడు : ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళ, బుధవారాల్లో దివ్యాంగుల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు తమ దివ్యాంగత్వ శాతం తిరిగి నిర్ధారించుకునేందుకు పరీక్షలు చేయించుకోవాలంటూ మండల పరిషత్ కార్యాలయ ఏఓ రామానుజం తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారు ప్రొద్దుటూరులో జరిగే నిర్ధారణా పరీక్షలకు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఏఓ కోరారు.

3న వసంత పంచమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ రవీంద్ర హైస్కూల్‌లో ఫిబ్రవరి 3న ఉదయం 8.30 గంటలకు వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివదర్శనానంద మాతాజీ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తారని ఆయన పేర్కొన్నారు. అక్షరాభ్యాసం చేయించుకునే చిన్నారుల తల్లిదండ్రులు ముందుగా తమ పేర్లను ఈ నెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7288999906 నంబరుకు సంప్రదించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండ స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. సుమూహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం



మాజీ ఎమ్మెల్యే రాచమల్లును సన్మానిస్తున్న లాయర్ అద్దంకి సుదర్శన్

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు లాయర్ అద్దంకి సుదర్శన్ సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిశారు. తనను నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు రాచమల్లును ఆయన పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోములవారిపల్లె మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గోటూరు వెంకటేష్, సెల్ సుబ్బయ్య, మార్క్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు దేసు రామమోహన్‌రెడ్డి రాచమల్లు శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు రాచమల్లుకు ఆయన పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లో ఆయన పార్టీ నాయకులతో కలసి పోస్టర్లను విడుదల చేశారు. మూడేళ్ల కాలంలో పేద ప్రజలకు, సమాజానికి, కార్మిక వర్గానికి సీపీఎం ఏవిధంగా ఉపయోగపడిందనే అంశంపై మహాసభల్లో చర్చ జరుగుతుందన్నారు. వచ్చే మహాసభ వరకు రాష్ట్ర ప్రజల అవసరాలు, ఇబ్బందుల పరిష్కారానికి ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చినప్పటికీ కడప జిల్లా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, విభజన హామీలు నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం విభజన హామీలపై నోరు మెదపడం లేదన్నారు. కడప జిల్లా స్టీల్ ప్లాంట్ కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పక్కీరయ్య, బాబు, శ్రీను, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, రమేష్ కుమార్, మహిళా సంఘం నాయకులు రాములమ్మ, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కడపలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ కోరారు. సోమవారం స్థానిక భావన జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక సిద్ధం చేయడానికి ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు ఆరేడు నెలల నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను నెలకు రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. జిల్లా మహాసభల్లో విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



వ్యవసాయాధికారులకు సూచనలిస్తున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు : రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ సూచించారు. సోమవారం బద్వేలు ఏడీఏ కార్యాలయంలో బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు, గోపవరం, సిద్దవటం, అట్లూరు మండలాల్లోని మండల వ్యవసాయాధికారులు, రైతుసేవాకేంద్రాల వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, అవసరమైన ఎరువులను రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. డీబీటీ కూడా పూర్తి చేస్తేనే తిరిగి ఎరువుల ఇండెంట్ పెట్టడానికి ఆస్కారం ఉంటుందని రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులకు సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు ప్రకటనపై హర్షం

బద్వేలు అర్బన్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత ప్రజా సంఘాల నాయకులు సంబరాలు చేశారు. అందులో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఓబయ్య, హెచ్.వెంకటసుబ్బయ్య, జె.గురయ్య, ఓ.భాస్కర్, జయచంద్రబాబు, దేవానందం, భాస్కర్, ఎం.పిచ్చయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కమిటీ సభ్యులు శోభన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎస్సీల్లో ఏబీసీడీల కోసం పోరాటం చేశారని తెలిపారు.

'మూఢ నమ్మకాలను నమ్మవద్దు'



మాట్లాడుతున్న కుతుబుద్దీన్

ప్రొద్దుటూరు కల్చరల్ : మూఢ నమ్మకాలను నమ్మవద్దని రోజీవెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు కుతుబుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను పాటించవద్దని, దాని వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సైంటిఫిక్ టెంపర్ మెంట్‌లో భాగంగా సారయ్య, పల్లవోలు రమణయ్యల మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు వారు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రఓబుళరెడ్డి, విశ్రాంత డీఈ అబీద్‌హుసేన్, ఫిట్టర్ రఫీ, హుసేన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



దూడకు నట్టల నివారణ మందు తాపుతున్న సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, పశు వైద్య సిబ్బంది

చాపాడు : మండల పరిధిలోని మొర్రాయిపల్లె గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వై.శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో 36 పశువులకు సాధారణ చికిత్సలు, 13 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 11 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 228 పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు పశు వైద్యాధికారి ఎం.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శివ, దేవ, సోహేల్, రామ్మోహన్, తులసమ్మ, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీని ప్రకటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం డీఎస్సీ ని ప్రకటించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది చదువు పూర్తి చేసుకొని ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు దావోస్ పర్యటన అట్టర్ ఫ్లాప్

ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్



ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలో పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వంద కోట్ల రూపాయల ప్రజాధనంతో మూడు రోజుల పాటు చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌లు దావోస్‌లోని పారిశ్రామిక వేత్తలను కలిసినా తెలుగుదేశ ప్రభుత్వ పాలనపై నమ్మకం లేక రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పక్కన పెట్టి చంద్రబాబు తన కొడుకు ఇమేజీను పెంచుకోవడానికే దావోస్ పర్యటన ఉపయోగపడిందే కాని దీనివల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీలేదన్నారు. వంద కోట్లు ఖర్చు పెట్టినా వంద రూపాయల ఒప్పందాలను కూడా చేసుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఒక రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే శాంతి భద్రతలు ముఖ్యమని లోకేష్ దావోస్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామని చెబితే ఎవరు పెట్టుబడులు పెడుతారని ప్రశ్నించారు. ఐపీఎస్ అధికారుల మీద కేసులు పెట్టడం, ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇవ్వక పోవడం హత్యలు, అత్యాచారాలు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకు వస్తారన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల వల్లనే ఏపీ బ్రాండ్ ఇమేజ్ పడిపోయిందని విమర్శించారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దావోస్ వెళ్లి లక్షయాభైవేల కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చారని, అది జగన్‌మోహన్ రెడ్డి సత్తా అన్నారు. ఇప్పటి కైనా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే తిరుగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

జూదం లేని ప్రొద్దుటూరు హామీ ఏమైంది?


- ఈ విషయంపైనే ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నాం
- మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి



అసాంఘిక కార్యక్రమాలు చేసేవారితో టీడీపీ నాయకులు ఉన్న ఫొటోలను చూపిస్తున్న వైస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నికల ముందు జూదం లేని ప్రొద్దుటూరును చేస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారని, దానిపైనే ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అసాంఘిక కార్యక్రమాలు చేసే వారి కోసం ఫోన్లు చేయరని న్యాయవాది ఈవీ సుధాకర్‌రెడ్డి చెప్పడంపై అభ్యంతరం చెప్పారు. ఎమ్మెల్యే, ఆయన కుమారుడు కొండారెడ్డిలు మంచివారని చెప్పే అర్హత కొండారెడ్డికి లేదన్నారు. కొందరు జూదరుల కోసం తాము ఎస్పీని ట్రాన్స్‌ఫర్ చేయించామని ఈవీ సుధాకర్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. పట్టణంలోని టూ టౌన్ సీఐని 2014లో జూదరుల కోసం బదిలీ చేయించింది ప్రస్తుత ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కాదా అని ప్రశ్నించారు. చెప్పిన మాట ప్రకారం జూదం లేని ప్రొద్దుటూరును చేయాలని మాత్రమే అడుగుతున్నామన్నారు. కౌన్సిలర్ మునీర్ మట్కా రాస్తూ పోలీసులకు దొరికిపోయాడన్నారు. క్లబ్‌లో పొద్దుపోయేందుకు స్కిల్ గేమ్ ఆడాలని మాత్రమే ఉందన్నారు. దీనిపై తమకు అభ్యంతరం లేదన్నారు. అయితే రూ.10 వేలు, రూ.20 వేలు సిండికేట్, రమ్మి ఆడటంపై మాత్రమే తాము అభ్యంతరం చెబుతున్నామన్నారు. హర్షవర్ధన్‌రాజు ఎస్పీగా ఉన్న సమయంలో క్లబ్‌లో జూదం జరగలేదని, మరి ఇప్పుడు ఎందుకు జరుగుతుందో ఈవీ సుధాకర్‌రెడ్డి చెప్పాలన్నారు. కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి పదే పదే తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఒకరిపై విమర్శలు చేసేముందు తనేంటో తెలుసుకోవాలని బంగారురెడ్డి అన్నారు. నల్లమందు వ్యాపారితో టీడీపీ నాయకులు కలిసి ఉన్న ఫొటోలను బంగారురెడ్డి చూపించారు. పార్టీ నాయకుడి పిలుపు మేరకు తాను రాజుపాళెం మండలంలోని ఒక గ్రామానికి డిన్నర్‌కు వెళ్లినట్లు తెలిపారు. పల్లెల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విచ్చల విడిగా దొరుకుతోందన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దీనికి ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. చౌకబారు విమర్శలు మానుకోవాలన్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన రూ.300 కోట్ల పనులు రద్దు అయ్యాయన్నారు. వెనక్కి వెళ్లిన నిధులను తిరిగి తీసుకురావడానికి టీడీపీ నాయకులు ప్రయత్నం చేయాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, వీవర్స్ వింగ్ చౌడం రవిచంద్ర పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న పట్టణాభివృద్ధి కమిటీ నాయకులు

బద్వేలు అర్బన్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్న మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, ఎంపీడీఓ డి.మల్లేశ్వరిలను వివిధ ప్రజాసంఘాల నాయకులు సోమవారం వేరువేరుగా సన్మానించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బద్వేలు పట్టణాభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.గురుమూర్తి, అధ్యక్షుడు నానబాలవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో యోగివేమన యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు ఎంపీడీఓను సన్మానించారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణాభివృద్ధి కమిటీ కోశాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యక్షులు రాజేష్, వెంగలరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, సమాచారహక్కు చట్టం రక్షణ వేదిక కన్వీనర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు అభినందనలు



ఏఎన్ఎం మాణిక్యమ్మను అభినందిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న మాణిక్యమ్మ ఉత్తమ ఏఎన్ఎంగా ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా సోమవారం ఆమెను కామనూరు వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్ బాబా, డాక్టర్ శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించిన ఎవరికైనా జిల్లా అధికారులు అవార్డులు ఇవ్వడం సంతోషకరమన్నారు. దీని వల్ల మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. లక్ష్యాలను సరైన సమయానికి వంద శాతం సాధించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణమ్మ, వరప్రసాద్, శ్రీధర్, మధు, చంద్రశేఖర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.